Civil Services (Main) Examination, 2024

PHKM-C-TLG

# తెలుగు / TELUGU

## (తప్పనిసరి) / (Compulsory)

నిర్ణీత సమయం : **మూడు** గంటలు
*Time Allowed :* ***Three Hours***

గరిష్ఠ మార్కులు : **300**
*Maximum Marks :* **300**

---

### ప్రశ్నపత్ర విశేష సూచనలు

**ముందుగా ఈ క్రింది సూచనలన్నింటిని జాగ్రత్తగా చదివి, సమాధానాలను రాయండి :**

అన్ని ప్రశ్నలకు సమాధానాలను రాయాలి.

ఒక్కొక్క ప్రశ్నకు / విభాగానికి మార్కులు ఆ ప్రక్కనే నిర్దేశింపబడి ఉంటాయి.

శీర్షికలో ప్రత్యేకంగా సూచింపబడిన స్థలాలలో తప్ప – అన్ని ప్రశ్నలకు సమాధానాలు **తెలుగులోనే (తెలుగు లిపిలోనే)** రాయాలి.

ప్రశ్నల వద్ద నిర్దేశించిన పదాల సంఖ్యను పాటించక ఎక్కువ రాసినా, తక్కువ రాసినా, ఉక్త పరిమితికంటే హెచ్చుతగ్గులున్నా మార్కులను తగ్గించటం జరుగవచ్చును.

ఈ లఘుపుస్తకంలో ఏదైనా ప్రశ్నకు, విభాగానికి సమాధానం రాయనప్పుడు ఖాళీ స్థలాన్ని విడిచిపెట్టక, ఆ చోట స్పష్టంగా కొట్టివేయాలి.

### Question Paper Specific Instructions

***Please read each of the following instructions carefully before attempting questions :***

*All questions are to be attempted.*

*The number of marks carried by a question / part is indicated against it.*

*Answers must be written in* ***TELUGU (Telugu script)*** *unless otherwise directed in the question.*

*Word limit in questions, wherever specified, should be adhered to and if answered in much longer or shorter than the prescribed length, marks may be deducted.*

*Any page or portion of the page left blank in the Question-cum-Answer Booklet must be clearly struck off.*

---

**Q1. ఈ క్రింది అంశాలలో ఏదైనా ఒకదానిని గురించి ఆరువందల (600) పదాలలో వ్యాసరచన చేయండి :** *100*

(a) ప్రజాస్వామ్యము మరియు భావప్రకటన స్వేచ్ఛ

(b) భారతదేశంలో మంచినీటి కొరత సమస్య ఆసన్నమవుతున్నదా ?

(c) గిరిజన సంస్కృతీ పరిరక్షణ : ప్రయత్నాలు సాధ్యాసాధ్యాలు

(d) ఓటికుండకు శబ్దమెక్కువ

**Q2. ఈ క్రింది గద్య భాగాన్ని శ్రద్ధగా చదివి, దిగువ ఇచ్చిన ప్రశ్నలకు సరైన సమాధానాలను స్పష్టమైన, సరైన మరియు సంక్షిప్త భాషలో వ్రాయండి :** *12×5=60*

విమర్శను, సాహిత్యంలో ఒక భాగంగా పరిగణించాలి. ఎందుకంటే సాహిత్యాన్ని దాని పరిధిలో ఉంచేది విమర్శయే కాబట్టి. రసప్రవాహానికి అడ్డు తగిలే విధంగా అనవసరంగా దేనినయినా ప్రవేశపెడితే అది దోషమవుతుంది. సంగీతంలో చూడండి ! శ్రుతి తప్పిన ధ్వని ప్రవేశిస్తే అది రసాభాస అవుతుంది.

మనసహజమైన భావవ్యక్తీకరణలోనే ఆనందముంది. అసహజమైన భావ వ్యక్తీకరణ ఆనందాన్ని కలిగించదు. అసహజమైన భావవ్యాపారంతో కూడా కొందరు వ్యక్తులు ఆనందాన్ని పొందే అవకాశం లేకపోలేదు. హింసాచరణ, పరులధనాన్ని అపహరించటం, ఇతరులకపకారం చేయటం వంటి స్వార్థపూరిత వ్యవహారాల వల్ల ఆనందాన్ని పొందితే పొందవచ్చును గాని అది మనసు యొక్క సహజధోరణి కాదు. దొంగ, వెలుతురు కంటే చీకటిని ఎక్కువగా ప్రేమిస్తాడు. అంతమాత్రంచేత వెలుతురు యొక్క గొప్పదనము తగ్గిపోదు.

ఇతరులతో మనల్ని మమేకం చేయగలిగే భావాలే సహజమైన భావాలు. ప్రేమభావనయే మనలను ఏకం చేస్తుంది. ద్వేషభావం విడదీస్తుంది. మితిమీరిన అహంకారం గలవాడు ఇతరులతో ఎలా కలుస్తాడు ? అందుకే మనిషికి, మనసుకు సహజమైంది ప్రేమ భావమే. అహంకార గుణం అసహజమైంది.

భక్తిభావాన్ని ఆచరించేందుకు ప్రత్యక్షంగా ఆధార భూతమైన వస్తువు యొక్క ఆవశ్యకత కనిపిస్తుంది. దయను చూపించాలంటే కూడా దానిని పొందే వాడుండాలి. ఓరిమిని మరియు ధైర్యాన్ని చూపించాలన్నా అవతలివైపు దానిని స్వీకరించగలిగే వ్యక్తులుండాలి. దీని తాత్పర్యమేమంటే బాహ్య ప్రపంచంలోని వ్యక్తులతో, వస్తువులతో సామరస్య భావంతో జీవిస్తూ మన భావాలను ప్రచోదితం

చేసుకోవాలి. మనం గమనించగలిగితే మనపైన బాహ్య ప్రపంచం యొక్క ప్రభావమేమీ లేదు. ఇతరుల పుత్రశోకాన్ని చూచి నాలుగు దుఃఖాశ్రువులు కార్చలేకపోతే, ఇతరుల ఆనందోత్సవాలలో కలసి పాల్గొని సంతోషించలేకపోతే; మనం ప్రాపంచిక స్థితికంటే అతీతంగా ఉండి 'నిర్వాణ' (నిర్లిప్తత) స్థితికి చేరుకున్నట్లు అర్థం చేసుకోవాలి. అటువంటి స్థితిలో సాహిత్యానికి ఎటువంటి విలువలేదు. ప్రపంచంలోని సుఖమైనా, దుఃఖమైనా ఇతరులతో కలిసి అనుభవించ గలిగే వాడే ఇతరుల కోసం ఆనందాన్నయినా కరుణనయినా సృష్టించగలడు, వాడే నిజమైన సాహిత్యకారుడు. తనకు తాను దుఃఖాన్ని అనుభవించటం కాదు. దాన్ని అభివ్యక్తీకరించేవాడు కళాకారుడు. మానవుల్ని భిన్న పరిస్థితులు భిన్నమార్గాలలో నడిపిస్తాయి. మానవులందరిలో భావాల విషయంగా సమానత్వమే ఉన్నప్పటికీ, ప్రతిస్పందించే తీరుమాత్రం ఒకే విధంగా ఉండదు. మనం కర్షకజనావళితో కలిసి, వాళ్లమధ్యనే జీవించే అవసరమేర్పడితే, సహజంగానే వాళ్ల సుఖసంతోషాల్ని, బాధల్ని పట్టించుకోవటం ప్రారంభిస్తాం. మనం కూడా మన భావ సాంద్రతను బట్టి వాళ్ల పరిస్థితుల చేత ప్రభావితమవుతాము. అదే విధంగా ఇతర పరిస్థితుల్ని కూడా అర్థం చేసుకోవాలి. దీనిని అన్వయించి చూసినపుడు, ఒక వ్యక్తి వ్యవసాయ దారుల కోసమో, కార్మికుల కోసమో, ఇతర ఉద్యమాల కోసమో ప్రచారం చేయటం అన్యాయమవుతుంది. ప్రచారము, సాహిత్యము వీటిమధ్య గల తేడా ఏమిటి ? ప్రచారంలో మనసు ప్రమేయముండదు-ఆత్మవిజ్ఞాపనముండదు. ఉద్దేశించిన లక్ష్యానికి సంబంధించిన ఉత్సుకతాపూరణతప్ప సార్థకమైన ప్రమేయమేమీ ఉండదు. సాహిత్యం చల్లని మందమలయానిలం వంటిది. ప్రచారం, పచ్చగా ఎదిగే వృక్షాల్ని, గుడిసెల్ని, భవనాల్ని ఒకే విధంగా కూల్చే తుఫాన్ లాంటిది. రసవిహీనమైన వస్తువేదీ ఆనంద కారకం కాదు. అందు చేత చాతుర్యం గల కళాకారుడెవరైనా, ఏవిషయాన్నయినా, వస్తువునయినా సౌందర్యంతో రసాత్మకతతో నింపి ఆనంద భరితం చేస్తాడు. అది కేవలం ప్రచార వస్తువుగా కాకుండ, మంచి సాహిత్యపు వస్తువుగా మలుస్తాడు.

(a) సాహిత్యంలో భాగంగా విమర్శను పరిగణించటానికి గల కారణమేమిటి ? 12

(b) సహజమూ, అసహజమూనైన భావవ్యక్తీకరణల లక్షణమేమిటి ? 12

(c) మనసు యొక్క సహజ ధోరణి కానిదేమిటి ? 12

(d) రచయిత దృష్టిలో నిజమైన సాహిత్యకారుడెవరు ? 12

(e) సాహిత్యము, ప్రచారము వీటి మధ్యగల భేదమేమిటి ? 12

Q3. ఈ క్రింది గద్యభాగాన్ని మీ సొంతమాటలలో మూడవ వంతు పరిమాణానికి కుదించండి, దీనికి శీర్షిక అవసరంలేదు : 60

ఈర్ష్య, ఒక నిర్దిష్ట వ్యక్తిని లక్ష్యంగా చేసేదని గుర్తెరగాలి. మనకు కేవలం సంపన్నులైన వారి పట్ల, గుణవంతులైన వారిపట్ల, గౌరవించబడేవారి పట్ల మాత్రమే అసూయ ఉంటుందనుకోవటం సరికాదు. ఏదైనా విషయంలో ఇతరులు మనతో పోల్చుకోవటం వలనగాని, లేదా మనమే కొందరితో పోల్చుకోవటం వలనగాని ఈర్ష్య ఆవిర్భవిస్తుంది. దాంతో పరస్పరం వ్యతిరేకంగా ప్రవర్తిస్తుంటారు. దూరదూరంగా ఉండే వ్యక్తుల మధ్య, ఏమాత్రమూ సంబంధం లేని వ్యక్తుల మధ్య ఈర్ష్యలు ఉత్పన్నం కావు. కలసి ఉండే వ్యక్తుల మధ్యగాని, సమీపంలో ఉండే వ్యక్తుల మధ్యగాని పోలిక వచ్చినప్పుడే ఈ అసూయ ఆవిర్భవిస్తుందని మనం గుర్తించగలం. యూరప్ లో నివసించే వ్యక్తి కున్న సంపదను గురించి విన్న కాశీలోని ధనవంతుడు అసూయ చెందుతాడా ? చెందడు. ఆంగ్లకవికున్న ప్రాముఖ్యాన్ని చూచి, ఒక హిందీ కవి అసూయపడడు. బంధువుల మధ్య, ఇరుగుపొరుగు వారిమధ్య అసూయలు చెలరేగటాన్ని తరచూ మనం చూస్తుంటాం. ఆబాల్యంగా ఒకరినొకరు చూసుకుంటూ పెరిగిన వాళ్లు, ఒకళ్ల అభివృద్ధిని చూసి మరొకళ్లు అసూయ చెందే అవకాశముంది. ఇద్దరు స్నేహితులలో ఒకడు సఫలుడై ఉన్నతిని సాధిస్తే, అదే ఉన్నతిని సాధించేందుకు తన స్నేహితుడు చేసే పోరాటానికి అతడు ఆటంకాల్ని సృష్టిస్తాడు. లోకంలో ఎవరికైనా తమ అభ్యున్నతికి ఆటంకాలు ఎదురవుతే, ఆ ఆటంకాలకు గల కారణాలను వెతికితే, వాటి వెనుక దీర్ఘకాలంగా తనతో స్నేహంగా ఉన్నవ్యక్తే ఉన్నాడని తెలిసికోవటం అసాధారణమేమీ కాదు. ఎప్పుడైతే మనము ఇతరులతో సంబంధాలను ఏర్పర్చుకొని, వారిని మనతో ఏకం చేస్తామో, మనము సానుభూతి మరియు సహాయం యొక్క సంభావ్యతను పెంపొందించుకోవడమే కాకుండా, అసూయ మరియు అసమ్మతిని కూడా పెంచుతాము. మన చేష్టలతో మంచితనాన్ని కనిపించినంతమేర వెలిగించుకుంటు పోవటమనే మార్గంతో తప్ప, భవిష్యత్తు పట్ల అభద్రతను పోగొట్టలేం. భవిష్యత్తు పట్ల ఉండే అభద్రతాభావం అజేయమైనది, అచంచలమైనది. మన విజ్ఞాన వివేకాలన్నిటిలో ప్రయత్నించినా దానిని పూర్తిగా అధిగమించలేం.

ఈర్ష్యతో కూడిన ప్రపంచంలో, ఈర్ష్యాళువులైన వ్యక్తులున్న సమాజంలో, ఈర్ష్యారహిత వ్యక్తిత్వాల్ని రూపొందించటమే సమాజపు తక్షణావసరం. సమాజపు దృష్టికోణం నుండి చూస్తే, సామాజిక ప్రభావంతో ఏర్పడిన అవసరపు ప్రేరణ వలననే అసూయమొదలవుతుంది. ఐశ్వర్యం, గుణం, గౌరవమనేవి సమాజంలో నలుగురికి తెలియ కుండా రహస్యంగా వైయక్తికంగా ఆస్వాదించి వ్యక్తి అనుభవించగలిగేవికావు. నిజంగా మనం సంపన్నులం కాకపోయినా, ఇతరుల కంటే గుణవంతులం కాకపోయినా సమాజం తమతో సమానులుగానో, ఉన్నతులుగానో చూస్తే సంతృప్తి పడతాం. అసూయాబాధితులం కాబోము. ఎంత చిత్రమైన విషయమంటే సమాజంలో ఎవరైనా ఏదైనా సాధించే ప్రయత్నంలో నష్టపోతే వాళ్లను చూచి సంతోషడటం. ఈర్ష్య సమాజ జీవనంలోని కృత్రిమతనుండి ఉత్పన్నమయ్యే విషం. మన హితైషులకు, ఇతరుల పురోభివృద్ధికి అపకారాన్ని కలిగించే ఈ విషప్రభావానికి కారణం తెలిసికోకుండానే అసహ్యంగా దాని ప్రభావంతోనే జీవిస్తున్నాం.

న్యాయాధిపతి న్యాయాన్ని చెపుతాడు, కార్మికుడు ఇటుకల్ని తయారు చేస్తాడు. సాంఘిక సంక్షేమ దృక్కోణంలో, జడ్జి ఇటుకల కార్మికుడి పట్ల అతను ఏవిధంగానైనా తక్కువ స్థాయిలో ఉన్నాడని వ్యక్తపరచడం సముచితం కాదు. సమాజంలో 'ఎక్కువ-తక్కువ' భావన బాగా పాదుకొనిపోయింది. ఇది భిన్నవర్గాల మధ్య దృఢంగా బలపడి, సమైక్యతా చైతన్యాన్ని, సాంఘిక వికాసాన్ని చాలా అరుదైన సందర్భాలలో మాత్రమే చూపెడుతున్నది. ఒకవేళ సమాజంలో వాళ్ల వాళ్ల జీవనోపాధులైన వృత్తుల మధ్య చిన్న-పెద్ద, గొప్ప-తక్కువ అనే భేదాలులేకుండా, విభిన్న వృత్తుల వారిని గౌరవించినట్లయితే, సమాజంలో అసంతృప్తిని పెద్దయెత్తున నిర్మూలించవచ్చు. ఎక్కడ ఈ ఎక్కువ తక్కువలన్న భేద భావన బాగా ప్రచారమవుతుందో, అక్కడ మానవ ప్రవర్తనపై అది చూపించే ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. మానవ శక్తి, ప్రత్యేకమైన కొన్ని ప్రదేశాలకే పరిమితమయ్యేవిధంగా మార్గదర్శనం చేయబడుతుంది. కార్యవిభాగాలు అసంతులనం చెందుతాయి.

*(361 పదాలు)*

**Q4.** ఈ క్రింది తెలుగు వచనాన్ని ఆంగ్లంలోనికి అనువదించండి : **20**

కుటీర పరిశ్రమలు, చిన్నతరహా పరిశ్రమలు గురించిన చర్చ భారత దేశంలో ఇప్పుడు మళ్లీ పుంజుకుంటున్నది. చిన్న ప్రాంగణాలలతో, కనీస మూలధనాన్ని పెట్టుబడిగా, తక్కువ కార్మిక వ్యయంతో గృహాధారిత వ్యాపారాలను స్థాపించే భావన అటువంటి పరిశ్రమ యొక్క ప్రధాన అంశం. వ్యక్తులు ఉత్పత్తిదారులుగా లేదా తయారీదారులుగా మారటానికి ఈ నమూనా దోహదం చేస్తుంది, జీవనోపాధిని పొందటానికి ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొంటుంది మరియు తద్వారా ఇంకా నిరుద్యోగంతో పోరాడుతూ మెరుగైన జీవన ప్రమాణాలను పొందటానికి దారితీస్తుంది. చిన్నతరహా పరిశ్రమలు మాత్రమే భారతదేశం లాంటి దేశాల అభివృద్ధికి దోహదం చేస్తాయనే వాస్తవాన్ని స్వాతంత్ర్యోద్యమ కాలంలోనే గాంధీజీ ఊహించారు. ఆయన చిన్న ఉత్పత్తి యూనిట్లను తయారు చేయటానికి, సాంప్రదాయిక పరిశ్రమల్ని పునరుద్ధరించటానికి ప్రజలను ప్రేరేపించాడు. ఇటువంటి దూరదృష్టి ఉన్నప్పటికీ, స్వాతంత్ర్యానంతర నాయకత్వం ఈరంగాన్ని పెద్దగా విస్మరించి, పెద్దపరిశ్రమలు ఆధిపత్యం చలాయించేలా చేసింది. ఈ పరిశ్రమలు సంపన్నవర్గాల వ్యక్తిగత ఆస్తులుగా మిగిలి పోయాయి. జనాభా పెరుగుదల, విద్యావ్యాప్తి, ప్రజలలో కలుగుతున్న జాగృతి, వ్యక్తుల హక్కులను గుర్తించి వాటికై డిమాండు చేయటం, నానాటికీ పెరిగిపోతున్న నిరుద్యోగుల సంఖ్య – ఇవన్నీ చైతన్య శీలురైన ఈ నాటి ఆలోచనాపరులను గాంధీ సిద్ధాంతాల్ని పునః పరిశీలించటానికి ప్రేరేపించాయి. అసలులేని స్థితి కంటే, ఆలస్యంగానైనా ప్రారంభం కావటం మంచిదేకదా ! నేడు చిన్న తరహా పరిశ్రమలను, దేశ అవసరాలతో సంతులనం చేసికోవాలనే అవగాహన పెరుగుతోంది. పర్యవసానంగా కుటీర పరిశ్రమల నెట్‌వర్క్ దేశవ్యాప్తంగా విస్తరించింది.

**Q5.** ఈ క్రింది ఖండికను ఇంగ్లీషునుండి తెలుగులోనికి అనువదించండి : *20*

In our democratic system, the press has a vital role. While there has been large-scale expansion of the print and visual media in recent years, a focused approach to dealing with major societal and political issues has still to evolve. There is, as yet, excessive and exaggerated coverage of exposures and scandals and far too little well-informed comment or analysis of the various deep-rooted factors which generate the continuing malaise. The media could make an extremely useful contribution by devoting adequate coverage to tasks well done, highlighting the achievements of honest and efficient public servants and organizations, according special attention to developments in the remote and backward areas of our country. Our media is free and unfettered. It should be able to expose cases and incidents involving irregular and unlawful exercise of authority and abuses of all kinds. The existing ills in our socio-political environment will, on present reckoning, take considerable time to remedy. The Department of Personnel and Administrative Reforms should focus on establishing institutions responsible for all personnel matters — appointments, postings, transfers etc. — without any external interference. Also, there is a need for adoption of a robust code of ethics to be followed by those involved in public functioning.

**Q6.** **(a)** ఈ క్రింది వాటిని మీ సొంత వాక్యాలలో ప్రయోగించండి : *2×5=10*

(i) కరతలామలకం *2*

(ii) అందెవేసిన చేయి *2*

(iii) మేకవన్నెపులి *2*

(iv) కుడితిలోపడ్డ ఎలుక *2*

(v) కంట్లోవత్తులేసికొని *2*

(b) ఈ క్రింది వాటికి సమానార్థక పదాలను రాయండి : **2×5=10**

(i) పూవు 2

(ii) పాము 2

(iii) పొగడ్త 2

(iv) ఆలస్యం 2

(v) ఇల్లాలు 2

(c) ఈ క్రింది వాటికి వ్యతిరేకార్థక పదాలను రాయండి : **2×5=10**

(i) పండితుడు 2

(ii) సులభము 2

(iii) కృతజ్ఞత 2

(iv) స్వాతంత్ర్యం 2

(v) సాపేక్షము 2

(d) ఈ క్రింది పదాలలోని తప్పుల్ని సరిచేయండి : **2×5=10**

(i) ద్రౌపతీ స్వయంవరం 2

(ii) చిత్తసుద్ధి 2

(iii) ధృక్కోణము 2

(iv) చెరవాణి 2

(v) సృష్ఠిస్తితులు 2